
ప్రజాశక్తి
సోమవారం 22 జులై 2024
5
విజయనగరం



కష్టపడితేనే ఉత్తమ ఫలితాలు

ఎమ్మెల్సీ పి.రఘువర్మ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

లక్ష్యాన్ని నిర్దేశించుకుని, కష్టపడి చదివితే ఉత్తమ ఫలితాలను సాధించవచ్చని ఎమ్మెల్సీ పి.రఘువర్మ అన్నారు. చైతన్య యువజన సేవా సంఘం వ్యవస్థాపకులు మజ్జి కాంతారావు ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక కనపాకలో పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టంతో పాటు ఇష్టంగా, ప్రణాళికా బద్ధంగా చదివితే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎంవిఎన్ వెంకట్రావు, రఘు ఇంజనీరింగ్ కళాశాల సిఇఒ ఎఎస్ ప్రకాశ్‌రావు, అయ్యప్ప కనస్ట్రక్షన్స్ అధినేత మజ్జి ఆదిబాబు, ఎన్ఆర్ఐ జూనియర్ కళాశాల సిఇఒ ఎం.రాంబాబు, ప్రిన్సిపల్ శ్రీనివాసరావు, మజ్జి నల్ల సూరి, మజ్జి గణేష్, దీప్తి, పైడ్రాజు, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో నిత్యకృత్యంగా మారిన రహదారి ప్రమాదాలు హడలెత్తిస్తున్నాయి. వాహనదారుల అతి వేగానికి తోడు ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా అధ్వానంగా మారిన రహదారులు నరకానికి నకళ్లుగా మారాయి. రోజూ ఎక్కడో ఒక చోట ప్రజలు విగత జీవులుగా మారుతున్నారు. వాహనంతో రోడ్డు మీదకు రావాలంటేనే ప్రజలు ఆలోచించే పరిస్థితి. ఎక్కడ చూసినా రోడ్లపై గుంతలే. జిల్లాలు, నియోజకవర్గాలు, మండలాలు, గ్రామాలను కలిపే రహదారులు దారుణంగా దెబ్బతిన్నాయి. గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే రోడ్ల పరిస్థితి చెప్పనక్కర్లేదు. అత్యంత దారుణంగా ఉండే ఈ రోడ్లపై గజానికో గుంత, అడుగుకో గొయ్యి దర్శనమిస్తోంది. వాహనదారులు వేరే దిక్కు లేక తప్పనిసరై ఈ రోడ్లపైనే ప్రయాణిస్తూ ప్రమాదాల బారిన పడుతున్నారు.

అడుగుకో గొయ్యి.. గజానికో గుంత



గుంతలమయమైన రోడ్డు

అధ్వాన రహదారులతో అవస్థలు

బొబ్బిలి : నియోజకవర్గంలో రహదారులు అధ్వానంగా మారాయి. ఐదేళ్లుగా రహదారులను గత ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో వాహనదారులు, ప్రజలు అవస్థలకు గురవుతున్నారు. రాష్ట్రీయ రహదారి, బొబ్బిలి-తెర్లాం రోడ్లు ప్రమాదాలకు కేరాఫ్‌గా మారాయి. రామభద్రపురం నుంచి బొబ్బిలి మీదుగా పార్వతీపురం వెళ్లే రాష్ట్రీయ రహదారిపై పెద్దపెద్ద గోతులు ఏర్పడ్డాయి. గొర్లెసీతారాంపురం వద్ద జరిగిన ప్రమాదాలలో మల్లమ్మపేట, పారాది గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు మరణించారు. అనేక మంది గాయపడ్డారు. గాయపడిన వారిలో కొంతమంది చికిత్స పొందుతూ మరణించిన వారు కూడా ఉన్నారు. గొర్లెసీతారాంపురం వద్ద పశువులు తరలిస్తున్న వ్యాన్ బోల్తా పడడంతో ఆవులు మరణించాయి. ఇప్పటికీ అక్కడ గోతులు అలానే ఉన్నాయి. జ్యూట్ మిల్లు నుంచి లచ్చయ్యపేట వరకు రోడ్డుపై గోతులు ఉండడంతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.



బొబ్బిలి-తెర్లాం రోడ్డులో గుంతలో దిగబడిన లారీ

బొబ్బిలి మండలంలోని పారాది వంతెన కుంగడంతో భారీ వాహనాలను బాడంగి, తెర్లాం మీదుగా దారి మళ్లించారు. భారీ వాహనాలు రాకపోకలు సాగించడంతో రోడ్డు పూర్తిగా పాడైపోయింది. రోడ్డుపై పెద్దపెద్ద గోతులు ఏర్పడడంతో లారీలు కూరుకుపోతున్నాయి. ఆర్‌టిసి బస్సులు కూడా రోడ్డుపై కూరుకుపోవడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు.

ప్రయాణం నరకయాతన

వేపాడ : మండలంలో బొద్దాం గ్రామంలో నాలుగు రోడ్ల జంక్షన్ నుండి ఓబులయ్యపాలెం గ్రామానికి వెళ్లే రహదారి అధ్వానంగా తయారైంది. రోడ్డంతా గుంతలమయమైంది. సోంపురం జంక్షన్ నుంచి వేపాడ మండల కేంద్రానికి వెళ్లే రోడ్డు గోతులతో నిండిపోయింది. సోంపురం, వేపాడ, వల్లంపూడి గ్రామాల వద్ద రహదారిపై ఏర్పడిన పెద్ద గోతుల్లో వర్షపునీరు నిండి ప్రమాదాలకు కారణమవుతున్నాయి.

రాళ్లు తేలి.. కోతకు గురై

భోగాపురం : మండలంలో ఇటీవల కురిసిన వర్షాలకు పలు రహదారులు కొట్టుకుపోయాయి. భోగాపురం నుంచి చాకివలస మీదుగా రెడ్డికంచేరు వైపు వెళ్లే ఈ రహదారి ముగడపేట చెరువు వద్ద కోతకు గురైంది. సవరవల్లి జంక్షన్ నుంచి జమ్మయ్యపేట వెళ్లే రహదారి విమానాశ్రయం నుంచి వచ్చే నీటి ఉధృతికి కోరుకుపోయింది. గతంలో ఉన్న బిటి రహదారి విమానాశ్రయ నిర్మాణంలో తొలగించడంతో ప్రహరీ గోడ ఆనుకొని కొత్తగా మళ్ళీ తారు రోడ్డు వెయ్యాలి. కానీ అధికారులు మట్టి రోడ్డు వేశారు. ముక్కాం వెళ్లే రహదారి నుంచి బమ్మిడిపేట వెళ్లే రహదారి గోతులతో మరింత అధ్వానంగా తయారైంది.



రాళ్లు తేలి అధ్వానంగా తయారైన బమ్మిడిపేట రహదారి

ఎక్కడికక్కడే గోతులు

బాడంగి : మండలం పరిధిలో రాజాం-రామభద్రపురం రహదారిపై ఎక్కడికక్కడే గోతులు ఏర్పడ్డాయి. ద్విచక్రవాహనాలు సైతం నడిపేందుకు వీల్లేక నరయాతన అనుభవిస్తున్నారు. పారాది వంతెన శిథిలావస్థకు చేరడంతో మండలం మీదుగా భారీ వాహనాలు రాకపోకలు సాగించడంతో రహదారులన్నీ అధ్వానంగా తయారయ్యాయి. పినపెంకి నుండి బొబ్బిలి వెళ్లే రోడ్డు పూర్తిగా దెబ్బతింది.





చెరువులా మారిన రాజాం-పాలకొండ ప్రధానరహదారి

ప్రధాన రహదారి ఇలా..

రేగిడి : రాజాం -పాలకొండ ప్రధాన రహదారి గుంతలమయం కావడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. గాయత్రి కాలనీ నుంచి బొబ్బిలి రోడ్డు వరకు, అంబేద్కర్ కూడలి నుంచి జిఎంఆర్ ఐటి వరకు, జిఎంఆర్ఐటి నుంచి సంకిలి షుగర్ వరకు ఆర్అండ్‌బి నిధులు రూ.12 కోట్లు మంజూరైనప్పటికీ నాణ్యతలేని మరమ్మతులు చేపట్టారు. దీంతో మూణ్నాళ్ల ముచ్చటగా ప్రధాన రహదారి తయారైంది.. గుంతల మయంగా ఉన్న ప్రధాన రహదారి లో నీరు చేరి వాహనదారులు గుంతలో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. కొన్ని సందర్భాల్లో మృత్యువాత పడి కుటుంబాలు వీధిన పడుతున్నాయి..



అధ్వానంగా తయారైన రోడ్డులో రాకపోకలు సాగిస్తున్న వాహనాలు

గుంతలమయం.. రైల్వేస్టేషన్ రోడ్డు

శృంగవరపుకోట : మండలంలోని బొడ్డవర జంక్షన్ నుంచి అమ్మపాలెం మీదుగా బొడ్డవర రైల్వేస్టేషన్‌కి వెళ్లే రహదారి అధ్వానంగా తయారైంది. మండలంలోని చిట్టెంపాడు, లక్ష్మీపురం, గాదిల్లోవ గిరిజన గ్రామాలకు ఈ రహదారి గుండానే వెళ్లాలి. సుమారు రెండు కిలోమీటర్లు మేర ఉన్న ఈ రహదారి పెద్దపెద్ద గోతులు ఏర్పడి అధ్వానంగా తయారైంది. గతంలో రైల్వేస్టేషన్ అభివృద్ధి పనుల నిమిత్తం భారీ వాహనాలు తిరిగేవి. అప్పట్నుండి ఈ రహదారి పూర్తిగా పాడైంది. వాహనదారులకు పాదచారులకు నరకయంగా మారింది. గత ప్రభుత్వ హయాంలో ఈ రహదారిని నూతనంగా నిర్మించేందుకు రూ.1.50 కోట్లఉ మంజూరైనట్లు నాయకులు చెప్పినా, పనులు కార్యరూపం దాల్చలేదు.

ప్రయాణికులకు పాట్లు

వంగర : మండలంలోని రహదారులు అధ్వానంగా తయారవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా అరసాడ నుంచి నీలయ్యవలస వైపు వివిధ గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారి, మడ్డువలస నుండి నీలయ్యవలస వైపు వెళ్లే రహదారి, వంగర నుండి శివ్వాం మీదుగా రుషింగి వైపు వెళ్లే ఆర్అండ్‌బి రహదారి, వంగర నుండి రాజాం పట్టణానికి, ఎం.సీతారాంపురం వెళ్లే రహదారి దారుణంగా తయారయ్యాయి. గ్రామాలకు వెళ్లే రోడ్లు గోతులుగా చిన్నపాటి వర్షం పడితే చాలు వరి పొలానికి దమ్ము పట్టే విధంగా బురదగా తయారై వెళ్లలేని పరిస్థితి నెలకొంది. వాహనాల ద్వారా వెళ్లాలంటేనే ఎక్కడ ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు.



నీలయ్యవలసకు వెళ్లే రోడ్డు దుస్థితి

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం

పది మందికి తీవ్ర గాయాలు ● ముగ్గురు పరిస్థితి విషమం

ప్రజాశక్తి-డెంకాడ/విజయనగరంకోట

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం పాలయ్యారు. పదిమందికి గాయాలయ్యాయి. ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది. ఆదివారం ఉదయం మండలంలోని జొన్నాడ వద్ద విజయనగరం - విశాఖ రహదారిపై ఈ సంఘటన చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం...





మృతిచెందిన నవీన్‌చందు (ఫైల్), సన్యాసి (ఫైల్)

మండలంలో బంగార్రాజుపేట గ్రామానికి చెందిన వ్యాను యజమాని మాంసం చేయడానికి 10 మందిని కూలీలను తీసుకుని శనివారం రాత్రి విజయనగరం రూరల్ మండలంలోని గుంకలాం వెళ్లాడు. అక్కడ పనిపూర్తిచేసుకుని ఆదివారం ఉదయం తిరుగు పయనమయ్యారు. జొన్నాడ వద్ద సైకిలిస్టు చందక లక్ష్మణరావు అడ్డురావడంతో ఆయన్ను వ్యాను ఢీకొంది. అంతటితో ఆగక ఆగి ఉన్న కారు వద్ద వేచిఉన్న తురక నవీన్ చందు (34)ను కూడా వ్యాను ఢీకొంది. దీంతో చందు అక్కడికక్కడే మృతిచెందాడు. అనంతరం డివైడర్‌ను వ్యాను ఢీకొని బోల్తా పడింది. దీంతో వ్యానులో ప్రయాణిస్తున్న బాడితబోయిన సన్యాసి (58) ఘటనా స్థలంలోనే మృతిచెందాడు.

వ్యానులో ప్రయాణిస్తున్న డి.తాళ్లవలస పంచాయతీ టి.కల్లాలు గ్రామానికి చెందిన వనుము సాయి, వి.తాతారావు, భోగాపురం మండలం పోలిపల్లి గ్రామానికి చెందిన వై.జోగి, భీమిలి మండలం దాకమర్రి గ్రామానికి చెందిన గొప్ప బంగారయ్య, గుంప రామకృష్ణ, గుంప సూర్యరమణ, అక్కివరం గ్రామానికి చెందిన షేక్ శ్రీను, ఎద్దుమట్టి కామరాజు, జామి మండలం ఎం.కొత్తవలసకు చెందిన జి.బంగార్రాజు, బొడ్డవలస గ్రామానికి చెందిన సైకిలిస్టు సంతక లక్ష్మణరావుకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని స్థానికుల సహాయంతో విజయనగరం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. వీరిలో తాతారావు, బంగారయ్య, లక్ష్మణరావు పరిస్థితి విషమంగా ఉంది. 8 మంది క్షతగాత్రులను వివిధ ప్రయివేటు ఆస్పత్రుల్లో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం చేర్పించారు. మిగిలిన ఇద్దరు జిల్లా కేంద్ర ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

మృతి చెందిన బాడితిబోయిన సన్యాసిది పూసపాటిరేగ మండలంలోని గుంపాం గ్రామం. ఈయన మటన్ చేయడానికి రోజువారి కూలికి వెళ్లి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఆయనకు భార్య, ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. సంఘటన స్థలాన్ని విజయనగరం డిఎస్‌పి ఆర్.గోవిందరావు పరిశీలించి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కృష్ణమూర్తి తెలిపారు.

అత్తారింటికి వెళ్లొస్తుండగా..

తురక నవీన్‌చందు స్వస్థలం గుంటూరు. హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. ఏడాది క్రితమే వివాహమైంది. పార్వతీపురంలోని అత్తవారింటికి వెళ్లి తిరిగి భార్య సుస్మిత, మరదలతో కలిసి కారులో గుంటూరు వెళ్తున్నాడు. ఈ క్రమంలో జొన్నాడ వద్ద టీ దుకాణం వద్ద ఆగారు. తిరిగి కారు దగ్గరకు చందు వస్తుండగా వ్యాను బలంగా ఢీకొంది. తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.



ఘటనా స్థలంలో చెల్లాచెదురైన క్షతగాత్రులు

వర్షాకాలం..

విద్యుత్తు వినియోగంపై అప్రమత్తం

- 6 కంట్రోల్ రూములు ఏర్పాటు
- నిరంతర విద్యుత్తు సరఫరాకు చర్యలు
- సమస్యలపై టోల్ ఫ్రీ 1912 నంబర్‌ను సంప్రదించాలి
- 'ప్రజాశక్తి'తో ఇపిడిసిఎల్ ఎస్ఇ ఎం.లక్ష్మణరావు ముఖాముఖి



'వర్షాకాలం నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. విద్యుత్తు ప్రమాదాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండేందుకు ఉమ్మడి విజయనగరం జిల్లాలో ఆరు కంట్రోల్ రూములు ఏర్పాటు చేశామ'ని ఇపిడిసిఎల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ ముప్పల లక్ష్మణరావు తెలిపారు. ఈ వారం తనను కలిసిన ప్రజాశక్తికి ఆయన ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. జిల్లాలో తీసుకుంటున్న చర్యలు, నిరంతర విద్యుత్ సరఫరాకు చేపట్టిన చర్యల గురించి అందులో వివరించారు. ఆ ఇంటర్వ్యూ వివరాలు...

- ప్రజాశక్తి, విజయనగరం టౌన్

వర్షాకాలం నేపథ్యంలో విద్యుత్తు ప్రమాదాల నివారణకు తీసుకున్న చర్యలేమిటి.?

వర్షాకాలం నేపథ్యంలో విద్యుత్తు స్తంభాలు, తీగల వద్ద జాగ్రత్తగా ఉండాలి. విద్యుత్తు వైర్లు తాకేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలి. ఎటువంటి సమస్య వచ్చినా విద్యుత్తు సిబ్బందికి సమాచారం ఇవ్వాలి. జిల్లా వ్యాప్తంగా వదులుగా ఉన్న స్తంభాల వైర్లు సరిచేశాం. జూన్ మొదటి వారం నుంచి జిల్లా వ్యాప్తంగా చెట్ల కొమ్మలు కొట్టించాం. వైర్లు మారుస్తున్నాం.

ప్రజలు ప్రమాదాల బారిన పడకుండా తీసుకున్న చర్యలు.?

జిల్లాలో ప్రజలు విద్యుత్తు వైర్లు, స్తంభాలు వంటి సమస్యలు ఏమున్నా వెంటనే సమాచారం ఇవ్వాలి. అందుకోసం నిరంతరం అందుబాటులో ఉండే 1912 టోల్ ఫ్రీ నంబరుతోపాటు విజయనగరం సర్కిల్‌లో 9490610102, విజయనగరం టౌన్‌లో 6300549126, విజయనగరం రూరల్‌లో 9440907289, బొబ్బిలిలో 9490610122, పార్వతీపురంలో 8332046778 నంబర్లతో కంట్రోల్ రూములు ఏర్పాటు చేశాం.


నిరంతర విద్యుత్తు సరఫరాకు తీసుకున్న చర్యలు ఏమిటి.?

విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా జిల్లాకు ఆవసరమైన స్తంభాలు, వైర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, ఇతర సామగ్రి సిద్ధంగా ఉంచాం. ప్రజలకు 24 గంటలు విద్యుత్తు సిబ్బంది అందుబాటులో ఉంటారు.

జగనన్న లే అవుట్‌లో విద్యుత్తు సరఫరా ఎంతవరకు వచ్చింది.?

గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన లేఅవుట్‌లో నిర్మించిన ఇళ్లకు విద్యుత్ సరఫరా అందించాం. దరఖాస్తు పెట్టిన వెంటనే విద్యుత్ కనెక్షన్ ఇస్తున్నాం. లేఅవుట్‌లో విద్యుత్ స్తంభాలు వేసి కనెక్షన్లు అందిస్తున్నాం.

ఎస్‌సి, ఎస్‌టిలకు ఉచిత విద్యుత్ అమలవుతుందా.?



పాత పద్ధతి ప్రకారంగా జిల్లాలో ఉన్న ఎస్‌సి, ఎస్‌టిలకు 200 యూనిట్లు వరకు ఉచితంగా సర్వీసు అందిస్తున్నాం. 200 యూనిట్ల పైబడి వారు వాటికి సంబంధించి బిల్లులు చెల్లించాలి.

పిఎం సూర్య ఘర్ పథకానికి స్పందన ఎలా ఉంది.?

ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకం ద్వారా సోలార్ విద్యుత్‌కు సోలార్ సూర్య ఘర్ యాప్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. రిజిస్ట్రేషన్ చేసుకున్న వారు ఛార్జీలు కింద వెయ్యి రూపాయలు ఆన్‌లైన్‌లోనే చెల్లించాలి. ఈ పథకానికి ఇంటి మేడ పైన వెయ్యి చదరపు అడుగుల స్థలం అవసరం. ఈ పథకం కేవలం బిపిఎల్ వినియోగదారులకు మాత్రమే వర్తిస్తుంది. సోలార్ విద్యుత్ భవిష్యత్తులో ప్రతి ఒక్కరికీ ఉపయోగకరంగా ఉంటుంది. ఈ పథకానికి దరఖాస్తులు ఆశించిన స్థాయిలో రావడం లేదు. ఉమ్మడి జిల్లా ప్రజలు దీనిని వినియోగించుకోవాలి.

జిల్లాలో ఎన్ని విద్యుత్తు సర్వీసులు ఉన్నాయి.?

విజయనగరం జిల్లాలో 8.68 లక్షల సర్వీసులు ఉన్నాయి. అందులో 450 హెచ్‌టి సర్వీసులు ఉన్నాయి. విద్యుత్ వినియోగంతో ఉమ్మడి జిల్లాలో నెలకు సుమారుగా రూ.200 కోట్లు బిల్లుల ద్వారా వసూళ్లు అవుతున్నాయి.

పంట పొలాలకు విద్యుత్తు సరఫరా ఏ విధంగా ఉంది.?

రైతులకు పంటలకు 9 గంటలు విద్యుత్తు అమలవుతోంది. రైతులు పంటకు ఇబ్బంది లేకుండా విద్యుత్తు సరఫరా చేస్తున్నాం. రైతులు మీటర్లు కావాలన్నా, విద్యుత్తు సమస్యల పరిష్కారం కోసం 1912 టోల్ ఫ్రీ నెంబర్‌ను సంప్రదించాలి.

వర్షాకాలం నేపథ్యంలో ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఏమిటి.?

వర్షాకాలం నేపథ్యంలో విద్యుత్తు విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ఇళ్లకు వైరింగ్ విషయంలో నాణ్యమైన వస్తువులను వాడాలి. విద్యుత్ స్తంభాలను తడి చేతులతో ముట్టుకోవద్దు. పంట పొలాల్లో విద్యుత్ వైర్లు తెగిపడి ఉంటే వాటిని ముట్టుకోకుండా విద్యుత్ సిబ్బందికి తెలియజేయాలి. రైతులు ప్రధానంగా అప్రమత్తంగా ఉండాలి. ఇళ్ల మీద నుంచి విద్యుత్ స్తంభాల వైర్లు వెళ్తుంటే జాగ్రత్తగా ఉండాలి. ప్రమాదకరంగా ఉంటే సిబ్బందికి తెలియజేయాలి.

భవనం ఫుల్.. సేవలు నిల్..

• దిష్టిబొమ్మలా కెఎల్ పురం అర్బన్ హెల్త్ సెంటర్ • వైద్యానికి నోచుకోని పేదలు

ప్రజాశక్తి - విజయనగరం టౌన్

ఎన్నికల ముందు విజయనగరంలోని 45వ డివిజన్ కెఎల్‌పురంలో ప్రభుత్వ నిధులతో నిర్మించిన అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని హడావుడిగా ప్రారంభించారు. ఇక నుంచి వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని అందరూ భావించారు. కానీ అలా జరగలేదు. ఇప్పటికీ ఆ భవనానికి తాళాలు వేసే ఉన్నాయి. పశువులు గొర్రెలకు నివాస ప్రాంతంగా మారింది. ఎన్నికల స్టంట్ కోసం హడావుడిగా ప్రారంబించారు తప్ప వైద్య సేవకు ప్రారంభం కాలేదు. ఇప్పటకీ విద్యుత్తు సౌకర్యం కల్పించలేదు. నీటి సదుపాయం లేదు. రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా బ్రిడ్జి నిర్మాణం చేస్తుండటంతో అర్బన్ కేంద్రానికి వెళ్లేందుకు దారి కూడా లేకపోవడం గమనార్హం. దీంతో ప్రస్తుతం అద్దె భవనంలోనే సేవలు కొనసాగుతున్నాయి. ఇక్కడ కొండ ప్రాంతం ఉండడంతో భూగర్భ జలాలు లేవు. దీంతో దూర ప్రాంతంలో బోరు వేసి, అక్కడి నుంచి పైపులైన్లు వేయాలి. కానీ ఆ పనులు నేటికీ జరగలేదు. మరో వైపు ఎన్నికల స్టంట్‌లో భాగంగా నగరంలో ధర్మపురి, బాబామెట్ట, వైఎస్ఆర్ నగర ప్రాంతాల్లో నిర్మించన కేంద్రాలు కూడా దిష్టిబొమ్మల్లా ఉన్నాయి. ప్రభుత్వాలు మారాయి తప్ప అర్బన్ హెల్త్ కేంద్రాలు వినియోగంలోకి రాలేదు. ఒక్కొక్క అర్బన్ హెల్త్ కేంద్రం రూ.80 లక్షలతో నిర్మించారు. నిర్మాణాలు పూర్తయినా వినియోగంలోకి తేకపోవడం పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వర్షాకాలం ప్రారంభమై రక రకాలు వ్యాధులు ప్రభలుతున్నాయి, ఇటువంటి పరిస్థితుల్లో వినియోగంలోకి తీసుకొని రావాల్సిన అధికార యంత్రాంగం కళ్ళు అప్పగించి చూస్తున్నారు తప్ప ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవడం లేదు. వెంటనే వినియోగంలోకి తీసుకొచ్చి నగర వాసులుకు వైద్య సేవలు అందించాలని పలువురు కోరుతున్నారు.



ఆరోగ్య కేంద్రం ముందు భాగంలో ఉన్న మేకలు



నిరుపయోగంగా ఉన్న అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం



సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి మండల అధ్యక్షులు కర్రోతు

ఎమ్మెల్యే సహకారంతోనే అభివృద్ధి

ప్రజాశక్తి - భోగాపురం

కూటమి నాయకులందరం ఎమ్మెల్యే లోకం మాధవి సహకారంతో మండలాన్ని అభివృద్ధి చేసుకుంటామని టిడిపి మండల అధ్యక్షులు కర్రోతు సత్యనారాయణ అన్నారు. పోలిపల్లి గ్రామంలోని ఆయన ఇంటి వద్ద ఆదివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యేతో తమకు విభేదాలు ఉన్నట్లు విస్తృతంగా ప్రచారం చేయడం దారుణమన్నారు. ఇప్పటి వరకు తమ మధ్య ఎటువంటి విభేదాలూ లేవని అన్నారు. జనసేన, బిజెపి, టిడిపి నాయకులు, కార్యకర్తలు కలిసిమెలిసి ఉన్నామని తెలిపారు. కావాలనే కొంతమంది వ్యక్తులు తమ మధ్య విభేదాలు ఉన్నట్లు ప్రచారం చేస్తున్నారని అన్నారు. ఈ సమావేశంలో నాయకులు పిడుగు తోటరావ్, రీసు రమణ, సూర్యతేజ మాస్టర్, బడే నాయుడు, చింతపల్లి శ్రీనివాసరావు, బొడ్డ హరిబాబు, కిలుము రామారావు తదితరులు పాల్గొన్నారు.



వసతి గృహం ముందు నిల్వ ఉన్న వరద నీరు

క్షణక్షణం... భయం భయం

ప్రజాశక్తి-తెర్లాం

తెర్లాం మండల కేంద్రంలో ఉన్న ఎస్‌సి వసతిగృహంలో విద్యార్థులు రెండు రోజులుగా బితుకుబితుకుమంటూ కాలం గడుపుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు వసతిగృహం నీటిలో తేలాడుతున్నట్లు ఉంది. అసలుకే భవనం శిథిలావస్థకు చేరింది. అలాంటి భవనంలో ఉంటున్న విద్యార్థులను వర్షాలు ఇంకా భయపెడుతున్నాయి. ఎప్పుడు ఏ గది స్లాబ్ పెచ్చులూడిపోతాయోనని ఆందోళన చెందుతున్నారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

మానవ హక్కుల రక్షణకు కృషి చేస్తా

ప్రజాశక్తి - రామభద్రపురం



మానవ హక్కుల రక్షణకు తనవంతు కృషి చేస్తానని ఇండో హ్యూమన్ రైట్స్ నూతన మండల అధ్యక్షునిగా ఎన్నికైన కనకల ధర్మారావు తెలిపారు. ఇటీవల జాతీయ కమిషన్ చైర్మన్ ప్రసాదరావు, జిల్లా అధ్యక్షులు అచ్చిరెడ్డి తనను మండల అధ్యక్షులుగా ఎంపిక చేశారన్నారు. తనకు వచ్చిన ఈ పదవిని బాధ్యతగా నిర్వహించి సామాన్య ప్రజల హక్కుల సంరక్షణకు కషి చేస్తానన్నారు. తన దృష్టికి వచ్చిన మానవ హక్కుల ఉల్లంఘనలను, వేధింపులను పరిశీలించి తగు న్యాయం చేస్తానని, తన స్థాయిలో పరిష్కరించలేని వాటిని జిల్లా నాయకత్వం దృష్టికి తీసుకు వెళ్లి న్యాయం చేస్తానని అన్నారు. ఈ సందర్భంగా ఆరికతోట గ్రామంలో సర్పంచ్ పుష్పమ్మ ఆధ్వర్యంలో పలువురు ధర్మారావుకు, మండల జనరల్ సెక్రటరీగా నియమితులైన కృష్ణకు అభినందనలు తెలిపారు.



పిచ్చిమొక్కలు, ముళ్ల పొదలను తొలగించిన తరువాత మరుగుదొడ్లు

ముళ్ల పొదలు తొలగింపు

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని ఆతవలో నిర్మించిన సామూహిక మరుగుదొడ్ల ముందు ఉన్న పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలను సిబ్బంది ఆదివారం తొలగించారు. ఈ సామూహిక మరుగుదొడ్లపై ప్రజాశక్తి దినపత్రికలో ప్రజాధనం వృథా పేరిట వచ్చిన కథనానికి స్పందించిన ఇఒపిఆర్‌డి ఉమా గ్రామ పంచాయతీ కార్యదర్శి డి. నానిబాబు పర్యవేక్షణలో కూలీలతో మరుగుదొడ్ల చుట్టూ ఉన్న ముళ్ళ పొదలను, పిచ్చి మొక్కలను తొలగించి పరిసర ప్రాంతాన్ని పరిశుభ్రంగా చేయించారు. సామూహిక మరుగుదొడ్లను మళ్లీ వినియోగంలో తీసుకొస్తామని చెప్పారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



మాట్లాడుతున్న జెవివి నాయకులు వెంకటరావు, తదితరులు

విజ్ఞానాన్ని అందించేందుకు కృషి చేయాలి

ప్రజాశక్తి- గరివిడి

సైన్స్, శాస్త్ర విజ్ఞానాన్ని సామాన్య ప్రజనీకానికి అందజే యడానికి జనవిజ్ఞాన వేదిక కార్యకర్తలు కృషి చేయాలని, ప్రజలలో ఉన్న మూఢ విశ్వాసాలని రూపుమాపాలని జెవివి జిల్లా అధ్యక్షులు ఎంవిఎన్ వెంకటరావు అన్నారు. గరివిడి, చీపురు పల్లి మండలాల ముఖ్య బాధ్యులతో స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెవివి ప్రధాన కార్యదర్శి రమణ ప్రభాత్, ఉపాధ్యక్షులు వి.రాజగోపాల్, సాహితీ స్రవంతి బాధ్యులు చీకటి దివాకర్, కురిమీనెల్లి మురళీ బాబు, జెవివి ఆశయాలు, లక్ష్యాలను వివరించారు. ఈ సమావేశంలో జెవివి బాధ్యులు ఎ.సత్యశ్రీనివాసు, వి.మోహనరావు, ఎం.సుశీల, కుసుమకుమారి, మీసాల అప్పల నాయుడు ఐక్య సత్యానారాయణ, జి.లక్ష్మణ, మామిడి శ్రీను, నారాయణరావు, బి.అప్పలస్వామి, సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ ఆదేశాలు బేఖాతరు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కలెక్టరేట్ ఎదురుగా ఉన్న కబేళాలను ఎత్తేయాలని జిల్లా కలెక్టర్ ఇచ్చిన ఆదేశాలను అధికారులు బేఖాతరు చేశారని ఆంధ్రప్రదేశ్ గోసంరక్షణ సమైక్య రాష్ట్ర అధ్యక్షులు లోగిశ రామకృష్ణ అన్నారు. ఆదివారం ఆంధ్రప్రదేశ్ గోసంరక్షణ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. అక్రమంగా గోవధ కేంద్రాలు, గోమాంసం కేంద్రాలు కొనసాగడం దారుణమన్నారు. జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఈ విషయం పై జోక్యం చేసుకొని మూసివేతకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

సిఎం దృష్టికి సాగునీటి కాలువల సమస్య

ప్రజాశక్తి - వంగర

సాగునీటి కాలువల సమస్యను సిఎం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని ఎమ్మెల్యే కొండ్రు మురళీమోహన్ అన్నారు. తోటపల్లి ప్రాజెక్టు కుడి ప్రధాన పాత కాలువ ద్వారా వంగర మండలానికి వచ్చే సాగునీటి కాలువలో జరుగుతున్న పూడికతీత పనులను మండలంలోని బంగారువలస, కొప్పరవలస వద్ద ఆయన ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా పలు గ్రామాలకు చెందిన రైతులు తోటపల్లి కుడి కాలువ, ఎస్ఎస్ ఛానల్ పనులు గత ఐదు ఏళ్లగా చేయకపోవడం వల్ల ఇబ్బందులు పడుతున్నామని ఆయనకు వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం తోటపల్లి కుడి కాలువలో సిమెంట్ పనులు చేసి మధ్యలో ఆపేసిన పనులను ఇప్పుడు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. మండలంలో గల సువర్ణముఖి నది ఒడ్డున ఉన్న కొప్పర, కొండచాకరాపల్లి గ్రామాల ఏటా ముంపునకు గురవుతున్నాయని ఈ సమస్యను సిఎం దృష్టిలో పెట్టి కరకట్ట నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. అనంతరం నియోజకవర్గం ఎస్‌సి సెల్ అధ్యక్షుడు మజ్జిగ గణపతి భార్య మజ్జి పార్వతి అనారోగ్యంతో బాధపడుతున్న విషయాన్ని తెలుసుకుని ఆ కుటుంబాన్ని వంగరలో ఎమ్మెల్యే పరామర్శించారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు బొత్స వాసుదేవరావు నాయుడు, పిన్నింటి మోహనరావు, లచ్చు బుక్త కృష్ణమూర్తి, పైల వెంకటరమణ, యలకల దుర్గబాబు, బెజ్జిపురం రవి, వివిధ మండలాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.



కాలువ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కోండ్రు మురళీ మోహన్, తదితరులు

ముంపు ప్రాంతాలను పరిశీలించిన ఎమ్మెల్యే

సంతకవిటి: ఇటీవల కురిసిన వర్షాల కారణంగా మల్లయ్యపేట, రామారాయపురం, మంతిన గ్రామాల్లో ముంపునకు గురైన ప్రాంతాలను, ఉద్రిక్తంగా ప్రవహిస్తున్న సాయన్న కాలువను ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ ఆదివారం పరిశీలించారు. ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులతో చర్చించారు. ఆయన వెంట టిడిపి సీనియర్ నాయకులు కోళ్ల అప్పలనాయుడు, టిడిపి మండల అధ్యక్షులు గట్టి భాను తదితరులు పాల్గొన్నారు.



పురస్కారాలతో విద్యార్థులు

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

ప్రజాశక్తి- శృంగవరపుకోట

మండలంలోని రాజీపేట వద్ద గల శంబలనగరి ఆశ్రమంలో తపస్వీ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో గురుపౌర్ణమి సందర్భంగా పట్టణంలో బాలికల ఉన్నత పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రథమ, ద్వితీయ స్థానంలో నిలిచిన ఉత్తమ విద్యార్థులకు ఆదివారం ప్రతిభా పురస్కారాలు అందించారు. అందులో భాగంగా విద్యార్థులకు వెండి పతకం, రూ.1116 చెక్‌లను ధ్యానం అమ్మలక్ష్మీ, ట్రస్టు ఛైర్మెన్ జి.సాంబశివరావు, కోగంటి సదాశివరావు, సన్నారెడ్డి రమేష్, హనుమశ్రీ, ఐ.కిషోర్ చేతులు మీదుగా పంపిణీ చేశారు. గురు పౌర్ణమి సందర్భంగా ఆశ్రమానికి వచ్చిన యాత్రికలకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ నిర్వాహకులు, భక్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

మలేరియాతో గిరిజన బాలుడు మృతి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం



మండలంలోని వంగర గ్రామానికి చెందిన మన్నంగి గౌతమ్ (9) అనే గిరిజన బాలుడు మలేరియాతో మృతి చెందినట్లు తల్లిదండ్రులు తెలిపారు. రెండు రోజుల క్రితం బాలుడికి జ్వరం రావడంతో తాడికొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువెళ్లి రక్తపరీక్ష చేసి చికిత్స అందించామని, అనంతరం ఇంటికి తీసుకువచ్చామని తెలిపారు. ఆదివారం ఉదయం మృతి చెందినట్లు చెప్పారు. గౌతమ్ తన స్వగ్రామమైన ప్రాథమిక పాఠశాలలో నాలుగో తరగతి చదువుకున్నాడు

బీమా చెక్కులు అందజేసిన నాగబాబు

ప్రజాశక్తి- బొబ్బిలి

రోడ్డు ప్రమాదంలో మరణించిన జనసైనికుడు పి.ధర్మతేజ కుటుంబ సభ్యులకు రూ.5లక్షల భీమా చెక్కును మంగళగిరి కార్యాలయంలో జనసేన రాష్ట్ర నాయకులు నాగబాబు అందించారు. పారాది గ్రామానికి చెందిన ధర్మతేజ కొన్ని నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో మరణించాడు. జనసేన సభ్యత్వం ఉన్న వారికి ఉచిత భీమా సౌకర్యం ఉండడంతో రూ.5లక్షల బీమా చెక్కును తల్లి సావిత్రమ్మకు నాగబాబు అందజేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇంచార్జి గిరడ అప్పలస్వామి, వీరమహిళ బి.దివ్య పాల్గొన్నారు.

రామభద్రపురం: మండల కేంద్రం పెదపల్లి వీధికి చెందిన జనసేన కార్యకర్త పెదపల్లి భాస్కరరావు (28) ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఇతని మృతికి సంతాపం తెలుపుతూ ఆ పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఆదేశాలు మేరకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొణిదల నాగబాబు మృతుని కుటుంబానికి రూ.5 లక్షల చెక్కును మంగళగిరి ఆఫీసులో ఆదివారం అందజేసినట్లు స్థానిక జిల్లా పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి మహంతి ధనుంజయ తెలిపారు. మృతుని భార్య పెద్ద పల్లి జ్యోత్స్నకు చెక్ అందజేసి కుటుంబ బాధ్యతలు, పిల్లల పెంపకం వంటి బాధ్యతలు జాగ్రత్తగా నిర్వహించాలని తెలిపారు.



చెక్కును అందిస్తున్న నాగబాబు

జరజాపుపేటలో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

జరజాపు పేటలో సాధన యువజన సంఘం ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. గరివిడి ఎంఇఒ పోలుబోతూ రామారావు ఈ శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. యువత రక్తదానంలో మరింత చైతన్యవంతంగా ఉండాలన్నారు. జనసేన నాయకులు ఎంఎం నాయుడు మాట్లాడుతూ రక్తదానం పై అపోహ విడనాడి యువత సామాజిక చైతన్యం పొందాలన్నారు. ఈ శిబిరంలో గ్రామ యువత స్వచ్ఛందంగా పాల్గొని 15 మంది రక్త దానం చేశారు. సాధన ప్రధాన కార్యదర్శి పసుమర్తి వెంకటరమణ, సభ్యులు అవనాపు అప్పలరాజు, మద్దిల రాంబాబు, పి.ఆనంద్, డి.పూర్ణ, ఎన్. మనీష్, ఎం.శేఖర్, హరి మోహన్ (టీచర్), సందీప్ తదితరులు పాల్గొని రక్తదాన శిబిరం విజవంతం చేశారు. జిల్లా మహ రాజా బ్లడ్ బ్యాంక్ సిబ్బంది రక్త సేకరణ చేపట్టారు. డాక్టర్ శిరీష, కౌన్సిలర్ అప్పలనాయుడు, టెక్నీషియన్ మురళీ, మహేష్ పాల్గొన్నారు.



రక్తదాన శిబిరంలో పాల్గొన్న యువకులు

ఆదివారమొస్తే క్యూలైనే..

ప్రజాశక్తి - భోగాపురం

కరోనా సమయంలో ఎప్పుడో మద్యం షాపుల వద్ద క్యూ లైన్‌లో నిలబడి మద్యం కొనుగోలు చేసేవారు. కానీ విమానాశ్రయ పుణ్యమా అని రెడ్డికంచెరు ప్రభుత్వ మద్యం షాపు వద్ద ఆదివారం వస్తే చాలు మందుబాబులు క్యూ లైన్‌లో వేచి ఉంటున్నారు. ఎందుకంటే విమానాశ్రయ పనుల కోసం ఉత్తరాది నుంచి అనేక మంది కూలీలు వచ్చారు. వీరంతా ప్రతి ఆదివారం ఆ మద్యం షాపు వద్ద విచ్చలవిడిగా వెళ్లి కొనుగోలు చేసేవారు. అయితే దీనిపై ఎక్సైజ్ శాఖకు చెందిన కానిస్టేబుల్ సన్యాసిరావు వారిని లైన్లో ఉండి కొనుగోలు చేయాలని చెప్పడంతో వారంతా లైన్లో వేచి ఉండి మద్యం కొనుగోలు చేస్తున్నారు. గతంలో ప్రతి ఆదివారం మూడు లక్షలు వరకు అమ్మకాలు జరిగేవి. విమానాశ్రయ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాక సుమారు ఐదు లక్షల పైబడి అమ్మకాలు జరుగుతున్నట్లు చెబుతున్నారు.



మందుబాబులను క్యూలో పెడుతున్న కానిస్టేబుల్

'జనసేనతో రాష్ట్రాభివృద్ధి'

ప్రజాశక్తి- తెర్లాం

జనసేనతో రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహన కార్యదర్శి బాబు పాలూరు అన్నారు. మండల జనసేన పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆ పార్టీ మండల అధ్యక్షులు మరడాన రవి ఆధ్వర్యంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాబు పాలూరు మాట్లాడుతూ జనసేన నాల్గో విడత క్రియాశీలక సభ్యత్వం కార్యక్రమాన్ని మండలంలో విజవంతం చేయాలనీ, ప్రతి ఒక్క జనసైనికులు, పార్టీ మద్దదుదారులు సభ్యత్వం నమోదు చేసుకునేలా అవగాహనా కల్పించాలన్నారు. సభ్యత్వం తీసుకున్న వారికి జనసేన పార్టీ తరుపున రూ.5 లక్షల ప్రమాద జీవిత బీమా ఉంటుందన్నారు. ఈ సమావేశంలో సీనియర్ నాయకులు చందక ఉమామహేష్, గెడ్డరమేష్, దుద్ది రమణ, కొట్నాన గోపి, శ్రీనివాస్, సత్యనారాయణ, సాయి, వావులపల్లి ఉమా తదితరులు పాల్గొన్నారు.



ఇంటిపై కూలిపోయిన విద్యుత్ స్తంభం

తప్పిన పెను ప్రమాదం

ప్రజాశక్తి - తెర్లాం

మండలంలోని కాలం రాజుపేట గ్రామంలో ఇటీవల కురిసిన వర్షాలకు వీధిలో ఉన్న కరెంటు స్తంభం ఆదివారం పడిపోయింది. ఆ సమయంలో ప్రజలందరూ ఇళ్లల్లో ఉండడం, కరెంటు లేకపోవడం వల్ల పెను ప్రమాదం తప్పిందని స్థానికులు చెబుతున్నారు. ఈ స్తంభం ఎదురుగా ఉన్న ఇంటిపై పడటంతో ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నట్లు స్థానికులు చెబుతున్నారు.

ఘనంగా గురు పౌర్ణమి వేడుకలు

ప్రజాశక్తి- విజయనగరం కోట

గురు పౌర్ణమి వేడుకలు జిల్లాలో ఆదివారం ఘనంగా జరిగాయి. నగరంలోని రింగ్ రోడ్డు సింహాద్రి నగర్‌లో గల షిరిడి సాయిబాబా ఆలయం, వుడాకాలనీలోని సాయిబాబా ఆలయానికి యాత్రికలు పోటెత్తారు. షిరిడీ సాయి సేవా సమాజం అధ్యక్షులు కరణం జనార్ధన రావు ఆధ్వర్యాన రింగ్ రోడ్డు ఆలయంలో ఘనంగా ఏర్పాట్లు చేశారు. వేకువ జాము నుంచే భక్తులు తరలి వచ్చారు. అజ్ఞానమనే చీకటిలో మగ్గుతున్న వారిని జ్ఞానమనే వెలుగు వైపు నడిపించాలని గురు పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించినట్లు జనార్ధనరావు తెలిపారు. ఇందులో భాగంగా వేకువ జామున 5.15 గంటలకు హారతి, నగర సంకీర్తన మొదలుకొని రాత్రి 8 గంటలకు భజన కార్యక్రమం, 9 గంటలకు పవళింపు సేవ నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్ర మంలో సేవా సమాజం కార్యదర్శి ఎఆర్ కోదండ రమేష్, ట్రెజరర్ పి. లక్ష్మణస్వామి ఇతర సభ్యులు పాల్గొన్నారు.



ప్రత్యేక పూజలు చేస్తున్న జనార్ధనరావు

గోతులను పూడ్చిన సర్పంచ్

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని సోంపురం జంక్షన్ నుంచి వేపాడ మీదుగా అనంతపురం వెళ్లే ప్రధాన రహదారి సోంపురం ప్రాథమిక పాఠశాల మలుపు వద్ద అధ్వానంగా తయారైందని గుర్తించిన ఆ గ్రామ సర్పంచ్ గంగరాజు స్పందించి వెంటనే తాత్కాలికంగా పూడ్చివేశారు. ట్రాక్టర్‌తో క్రషర్ బుగ్గి తెప్పించి గుంతలమయమైన రోడ్డును దగ్గరుండి పూడ్చివేశారు. నిధులు వస్తే పూర్తిగా రోడ్డును బాగు చేస్తామని అంత వరకూ ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా ఈ రోడ్డుకు పడిన గుంతలను పూడ్చుతున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాగమణి పాల్గొన్నారు.



రహదారి గోతులను పూడ్చుతున్న సర్పంచ్

మహిళలకు రక్షణ కల్పించాలి

ఐద్వా జిల్లా అధ్యక్షులు పుణ్యవతి

ప్రజాశక్తి-బొబ్బిలి

మహిళలపై రోజురోజుకు అత్యాచారాలు, లైంగిక వేధింపులు పెరిగిపోతున్నాయని, మహిళలకు రక్షణ కల్పించాలని ఐద్వా జిల్లా అధ్యక్షులు కె.పుణ్యవతి డిమాండ్ చేశారు. రామభద్రపురం మండలం జీలుగువలసలో ఆరు నెలల పసికందుపై జరిగిన అత్యాచారం మరువకముందే ఇందిరమ్మ కాలనీలో కన్న కూతురిపై తండ్రి అత్యాచారం చేయడం చూస్తే సమాజం ఎటుపోతుందో అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సోషల్ మీడియా, సీరియల్స్, సినిమాలలో మహిళలను కించపరిచే విధంగా వీడియోలు, ఫోటోలో పెట్టడం వల్లనే బాలికలు, మహిళలపై అత్యాచారాలు, లైంగిక వేధింపులు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దేశ వ్యాప్తంగా జరుగుతున్న అత్యాచారాలు, లైంగిక దాడులపై అధ్యయనం చేసి నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని కోరారు. మహిళలు బయటకు రావాలంటే భయమేస్తోందని, వారికి రక్షణ కల్పించాలని కోరారు. అత్యాచార, లైంగిక వేధింపులు నిందుతులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం

ప్రజాశక్తి - తెర్లాం

పుస్తక పఠనంతో విద్యార్థులకు విజ్ఞానం అలవడుతోందని స్థానిక శాఖా గ్రంథాలయాధికారి సిహెచ్ కృష్ణమూర్తి అన్నారు. పుస్తక పఠనంలో భాగంగా చందమామ కథలు, నీతి కథలు, అక్బర్ చక్రవర్తి, అలెగ్జాండర్ చక్రవర్తి కథలు పిల్లలకు వినిపించారు. మహాత్మా గాంధీ జీవిత చరిత్ర, దేశ నాయకులు చరిత్ర చదివించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ హై స్కూల్ టీచర్ విస్సు, విద్యార్థులు పాల్గొన్నారు.